



పేదల జీవన ప్రమాణాలను పెంచాలి : కమిషనర్

ప్రజాశక్తి -నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వస్తువులను సేకరించి, మార్కెట్లో విక్రయించి జీవనం సాగించే వ్యర్థకారులను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ ను కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్లో మంగళవారం నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించి కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం ద్వారా గతంలో 93 మంది భూగర్భ డ్రైన్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులకు ఐదు లక్షల విలువైన ఉచిత వైద్య సేవలు పొందే ఆయుష్మాన్ కార్డులను, స్వచ్ఛ ఉద్యమి యోజన ద్వారా లోన్లు కూడా అందించామని తెలిపారు. నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్ సాయి కృష్ణ, నవజీవన్ ఆర్గనైజేషన్ ఆర్.ఓ. సహదేవయ్య శానిటేషన్ సూపర్వైజర్ నరసింహారావు ఉన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

టిడిపిలో 'ఇసుక' దుమారం..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనింగ్, ఇసుక, గ్రావెల్స్, సిలికా అంతా అడ్డదారిలో సరిహద్దులు దాటిపోతూనే ఉంది..."అందరూ...కుండలో చికెన్ మాయమైనట్లు" నేతలంతా సూక్తులు చెబుతున్నా రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమ మైనింగ్ జరుగుతూనే ఉంది. ఓవైపు సైదాపురం తెల్లరాయి,. చిల్లకూరు సిలికా..అడ్డగోలుగా దోచేస్తుంటే, పెన్నా నుంచి పెద్ద ఎత్తున ఇసుక ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిపోతూనే ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచి ఉద్దేశంలో అందరికీ ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టారు. దీని చాటున టిడిపి నేతలు కొందరు, వారి అనుచరులు ఇసుక పెద్ద ఎత్తున తరలిపోతూనే ఉంది. మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలిసినా దగ్గరుండి పంపుతున్నారనే ప్రచారం సాగుతోంది. సోమవారం రాత్రి నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నగరంలో ఇసుక లారీలు పట్టుకున్నారు. అక్రమ రవాణాను బయటపెట్టారు. 'నారాయణ' సార్‌కు చెడ్డపేరు తీసుకొస్తున్నారంటూ చెప్పారు. తొమ్మిది నెలల నుంచి తంతు సాగుతున్నా ఇప్పుడు టిడిపి నేతలే ఇసుక అక్రమ రవాణా బయటపెట్టడంతో టిడిపి నేతల మధ్య దుమారం రేగింది. ఇద్దరు నేతలు నువ్వా..నేనా అన్నట్లు నగరంలో వ్యవహరిస్తున్నట్లు తెలిసింది...

- ◆తొమ్మిది నెలలుగా దోచేస్తున్నారు..
- ◆అడ్డుకున్న 'కోటంరెడ్డి'
- ◆'నారాయణ' పేరుతో సూక్తులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

పెన్నానది తీర ప్రాంతంలో నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ కొందరు అక్రమాలకు ఉపయోగపడుతోంది. ఉచితం మాటున భారీగా తరలిస్తున్నారు. ఇటీవల వెంకటగిరి నియోజకవర్గంలో 20 టన్నులు లారీలు వెళ్లి బ్రిడ్జి కూలిపోయిన విషయం తెలిసిందే. పెన్నా నదిపరివాహక ప్రాంతాల నుండి రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. నగరంలో ఎటూ చూసిన ఇసుక ట్రాక్టరే, ట్రాఫిక్ ఇబ్బందులను పోలీసులు పక్కన పెట్టి ఇసుక లారీలను అనుమతిస్తున్నారు. సాయంత్రం నుంచి తెల్లవారు జాము నుండి టిప్పర్లు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి. 12 టైర్ల భారీ టిప్పర్లు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ నుంచి ఒంగోలు, చెన్నయ్, బెంగళూరుకు టిప్పర్లు అక్రమంగా తరలిపోతున్నాయని తెలుస్తోంది. అధికారపార్టీ నేతలు దగ్గరుండి చేస్తుండడంతో ఏ ఒక్క అధికారి అటు వైపు చూడడం లేదు. సామాన్యులకు ఇసుక దొరక్కపోయినా రోజు సరిహద్దులు దాటిపోతూనే ఉన్నాయి. మైనింగ్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇసుకకు లెక్కా పక్కా ఉండడం లేదు. అధికారపార్టీ నేతల ఎవరి లెక్కలు వారికి ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పుడు ఇసుక వివాదం నెల్లూరు నగర టిడిపిలో దుమారం రేపుతోంది.

టిడిపిలో ఇసుక దుమారం..!

నెల్లూరునగరం నుండి పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇది ఇప్పుడు కథ కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాత్రుల్లో టిప్పర్ల ద్వారా ఒంగోలు, చెన్నయ్, బెంగుళూరు ఇతర ప్రాంతాలు యథేచ్ఛగా సాగిపోతూనే ఉన్నాయి. మంత్రి పి. నారాయణకు సన్నిహితులు కొందరు ఈ వ్యవహారంలోఉన్నట్లు ప్రచారంసాగుతోంది. నగరంలోని టిడిపి నేతలు కొందరు తమ బంధువులకు ఇసుక అప్పగించడంతో ఈ ప్రాంతంలో మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. రాత్రి 8 నుండి తెల్లవారు జాము వరకు లారీలు, భారీ టిప్పర్లు ఇసుక తరలిస్తున్నారు. మంత్రి నారాయణకు విషయం తెలియక పోయినా ఆయన అనుచరులు, ముఖ్యనాయకులకు ఈ వ్యవహ రంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. తొమ్మిది నెలల నుండి కోట్ల రూపాయలు ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన అనుచరులతో దీన్ దయాళ్ నగర్ సమీపంలో ఇసుక టిప్పర్లు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంత్రి నియోజకవర్గంలో ఆయనకు చెడ్డపేరు తెచ్చేలా కొందరు వ్యవహరిస్తున్నారంటూ అగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇసుక కొందరు అక్రమంగా తరలిస్తున్నారనే మీడియాకు తెలిపారు. తొమ్మిది నెలల నుండి సాగుతోన్న ఈ అక్రమాలను అడ్డుకోవడంతో అసలు విషయం బయటకొచ్చింది. నారాయణకు అత్యంత సన్నిహితులు ఈ వ్యవహారంలో ఉండడంతో ఆ విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లడానికి టిప్పర్లు అడ్డుకున్నారని తెలుస్తోంది. అక్రమార్కులను పట్టుకోకుండా, నారాయణకు చెడ్డపేరు తీసుకొస్తున్నారంటూ చెప్పడంతో నగరంలోని టిడిపిలోని రెండు గ్రూపుల మధ్య ఇసుక దుమారం నడుస్తోంది. ఈ విషయంలో మంత్రి నారాయణ ఏలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి...


ఇసుక టిప్పర్లు పట్టుకున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

ఇసుక దోచుకుంటున్నారు.. 'కోటంరెడ్డి

నెల్లూరు నగరంలో ఇసుక అక్రమ రవాణా ద్వార ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని, మంత్రి నారాయణకు చెడ్డపేరు తీసుకొస్తున్నారని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. సోమవారం రాత్రి ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. పేదలకు అందాల్సిన ఇసుకను కొందరు పక్కదారి పట్టిస్తూ, సరిహద్దులు దాటిస్తున్నారని విమర్శించారు. టిప్పర్లు, డ్రైవర్లు పట్టుకొని ప్రశ్నించారు. నగరంలో రాత్రుల్లో టిప్పర్లు, జెసిబిలు, హిటాచీలు పెట్టి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారని తెలిపారు. పేదవారి కోసం ఇసుకను సిఎం చంద్రబాబు ఫ్రీ చేస్తే.. వాటిని అక్రమార్కులు తప్పుదారి పట్టిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కుల ధన దాహం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వెనుక ఉన్న మాఫియా లీడర్ ఎవరో పోలీసులు తేల్చాలని డిమాండ్ చేసారు. పరారీలోని కన్నా అలియాస్ కార్తీక్ ను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. టిడిపి నేతలే ఇసుక మాఫియాను బయటపెట్టారు. పోలీసులు ఏం చేస్తారో చూడాలి.

గృహ రుణాల మంజూరు సులభతరం

ప్రజాశక్తి -నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని వెంకటేశ్వరపురం అల్లిపురం అక్కచెరువుపాడు కల్లూరు పల్లి లే అవుట్లలో టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల బ్యాంకు రుణాల ప్రక్రియను సులభతరం చేయాలని, వారి కుటుంబ సభ్యులలో మంచి సిబిల్ స్కోర్ ఉన్న వారిని కూడా జాయింట్ చేస్తూ రుణాలు మంజూరు చేసి, గృహాలను కేటాయించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. టిడ్కో గృహాల కేటాయింపు పై టిడ్కో విభాగం అధికారులు, మెప్మా విభాగం, బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ మాట్లాడుతూ జూన్ నెల 12వ తేదీ నాటికి పెండింగ్ లో ఉన్న లోన్లు అన్నిటిని క్లియర్ చేసి, లబ్ధిదారులకు గృహాలను అందజేయాలని ఆదేశించారు. టిడ్కో ఎస్.ఈ. మహేష్, డీ .ఈ.ఈ. పార్థసారథి, డి.సి.ఓ రామ సుబ్బారావు, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగ సిబ్బంది, మెప్మా విభాగం సి.ఎం.ఎం, సి.ఓ ఉన్నారు.


సమీక్షిస్తున్న కమిషనర్ నందన్

పొదుపుపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - లింగసముద్రం

పొదుపు సంఘాల ద్వారా మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సింహాద్రి రావు చెప్పారు. స్థానిక మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షురాలు అంగులూరి మాలతి అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఎపియం సింహాద్రి రావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విఒఎలు ప్రతినెల గ్రామ సమాఖ్య సమావేశాలు తప్పనిసరిగా జరపాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న వారు క్రమం తప్పకుండా తిరిగి బ్యాంకుకు చెల్లించే విధంగా వారితో మాట్లాడి అవగాహన కల్పించాలని చెప్పారు. రుణాలు తీసుకున్న వారందరితో తిరిగి చెల్లించినప్పుడే బ్యాంకుల ద్వారా వెంటనే మళ్ళీ రుణాలు ఇప్పించే అవకాశముందన్నారు. అన్ని గ్రామాల సమాఖ్యల అధ్యక్షరాలు సిసిలు నారా యణమ్మ,మాధవ, మాధవ రావు,అర్చన ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం సింహాద్రి

నేటి నుంచి జాతీయ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

విక్రమ సింహపురి యూనివర్శిటీలో అఖిల భారత అంతర యూనివర్శిటీల మహిళా సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ నేటి నుండి మే 3 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు పూల్స్‌లో 95 జట్లులు పోటీల్లో పాల్గొంటున్నాయి. నాక్ అవుట్ దశలో మొత్తం 91 మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం వరకు సాగనున్నాయి. ప్రతి రోజు సుమారు 325 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. నేడు సాయంత్రం 5 గంటలకు ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గోనున్నారు. యూనివర్సిటి విసి ఆచార్య అల్లం శ్రీనివాసులు షెడ్యూల్ విడుదల చేశారు



ప్రాక్టీస్‌లో క్రీడాకారులు

సిఎం ఆత్మకూరు పర్యటన ఖరారు

11 నుంచి 5.30 గంటల వరకు ఇక్కడే..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు ఆత్మకూరు పర్యటన అధికారికంగా ఖరారైంది. మే 1 ఉదయం 11.30 గంటలకు ఆత్మకూరు బాలికలు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. 11.50 గంటలకు నెల్లూరు పాళెం చేరుకుంటారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేస్తారు. 12.10 నుంచి 12.30గంటల వరకు బిల్డింగ్ వర్కర్లతో మేడే సందర్భంగా ముఖాముఖిలో పాల్గొంటారు. 12.35గంటలకు ఎపిఐఐసికు చేరుకొని ఎం.ఎస్,ఎంఇ పార్కు ప్రారంభిస్తారు. 1.30 నుంచి 3 గంటల వరకు ప్రజా వేదికలో పాల్గొంటారు. అనంతరం 3.05 గంటలకు టిడ్కో గ్రౌండ్ చేరుకొని 4.40గంటల వరకు పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం ఉండవల్లి బయల్దేరి వెళతారు. వారం రోజుల నుండి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక రోజంతా ఆత్మకూరులోను ఉండడంతో భారీ బందో బస్తు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ ఓ. అనంద్, ఎస్పి కృష్ణకాంత్ ఏర్పాట్లు దగ్గరుండి చూస్తున్నారు.


ముఖ్యమంత్రి
నారా చంద్రబాబునాయుడు

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రభుత్వ పారి శామిక శిక్షణా సంస్థలో 2025-2026 సంవత్సరానికి గాను మొదటి విడత పవేశాల కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి. నాగేశ్వరరావు తెలిపారు ఎస్‌ఎస్‌సి, ఆపై అర్హత కలిగిన అభ్యర్థిని ,అభ్యర్థులు వెబ్ సైట్ ద్వారా 24-5-2025 సాయంత్రం 6:00 గం:లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని అనంతరం అప్లికేషన్ ఫామ్‌ను భద్రపరుచుకోవాలన్నారు.

'పది' విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ టిడిపి కార్యాలయంలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కందుకూరు శ్రీ చైతన్య హైస్కూలు చెందిన విద్యార్థులు రామాల వైష్ణవి (593 మార్కులు) ద్వితీయ స్థానము సాధించిన గుర్రం ముఖేష్ (592) లను ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు మంగళ వారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు విద్యార్థులతో మాట్లా డుతూ భవిష్యత్తులో చదివే ఉన్నత చదువులలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని చదువుకున్న విద్యాసంస్థలకు , తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసు కురావాలని విద్యార్థులకు సూచించారు చైతన్య విద్యాసంస్థల ఆర్ ఐ అనిల్ కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు, ప్రిన్సిపల్ బి.సురేష్, డీన్ బ్రహ్మయ్యసి బ్యాచ్ ఇంచార్జి శివయ్య, ఎఒ సురేష్ నాయుడు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న
ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు

జామాయిల్ తోట దగ్ధం
తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-ఉలవపాడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం పక్కన జామాయిల్ తోటకు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమా చారం అందించారు. విషయం తెలుసుకున్న పక్కనే ఉన్న షిరిడి సాయిబాబా మందిరం నిర్వాహకులు వాటర్ పైపు ద్వారా నీళ్లతో మంటలార్పారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ వ్యాపారస్తులు పేర్ల మల్లయ్య శెట్టి కి చెందిన 9 ఎకరాల పైనా గల జామాయిల్ తోటలో మంగళవారం మధ్యాహ్నం మంటలు చెలరేగుతుంటే ఆ ప్రాంతమంతా పొగతో అలుముకుంది. గుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనులు పరుగులెత్తారు. సమాచారం అందిన వెంటనే కందుకూరు అగ్నిమాపక కేంద్రం వారు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి మంటలు ఆర్పి పరిశీలించారు.


కాంతారావుకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు, ఎల్ ఐ సి ఏజెంట్లు కందుకూరు బ్రాంచ్ ప్రెసిడెంట్ అబ్బూరి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ రవ్వా శ్రీనివాసులు ఏజెంట్‌ల ఆధ్వర్యంలో కందుకూరు ఎల్ ఐ సి బ్రాంచ్ లో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గా పనిచేసి పదోన్నతి పై చీఫ్ మేనేజర్‌గా కర్నూలు బ్రాంచ్‌కు బదిలీపై వెళ్తున్న ఐవి కాంతా రావును మంగళవారం సత్కరించార ువారు మాట్లాడుతూ 37 ఏళ్ల సర్వీసులో 27 ఏళ్లు జోన్ లోని అతిపెద్ద బ్రాంచ్ అయినా కందుకూరులో ఆత్మీయ ఏజెంట్లు సిబ్బంది అందరితో కలిసి పనిచేసే అదష్టం తనకు కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. నూతన చీఫ్ మేనేజర్ జనార్దన్, లియాఫి ఏజెంట్‌లు పాల్గొన్నారు.


కాంతారావును సన్మానిస్తున్న దృశ్యం

వీధి దీపాల వెలుగులు..

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండల కేంద్రంలోని గ్రంధాలయం నుంచి మిట్టపాలెం సెంటర్ వరకు వెలగని వీధి దీపాలను వెలిగించారు. వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపిన వెంటనే గుడ్లూరు సర్పంచ్ శంకర్ స్పందించి సమస్యను పరిశీలించి వెంటనే వీధి దీపాలను వేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సర్పంచ్ శంకర్. బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు



వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు

నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల బెడదను తొలగించేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడంతోపాటు వాటికి శస్త్ర చికిత్సల కాలంలో వాటికి అవసరమైన ఆహారం, మందులను అందించి వేగవంతంగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ వెటర్నరీ వైద్యులను ఆదేశిం చారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 5 వ డివిజన్ వైకుంఠపురం, సత్యనారా యణపురం, నేత నగర్, అహ్మద్ నగర్, అరవపాలెం, స్థానిక 6 వ డివిజన్ స్టోన్ హౌస్ పేట, చెన్నూరు వారి వీధి, సాలె వీధి తదితర ప్రాంతాలలో మంగళవారం పర్యటించారు. నెల్లూరు నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ఇంజనీరింగ్ విభాగం డి.ఈ.ఈ. ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా ఉన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై

రఘురామకృష్ణమరాజు అనుచిత వ్యాఖ్యలు అమానుషం

ప్రజాశక్తి -నెల్లూరు

ఉండి నియోజకవర్గంలో పేదోళ్ల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేయడం, నష్టపరిహారం ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా చేయడం అన్యాయమని ప్రశ్నించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పై అనుచిత వ్యాఖ్యలు చేసి అహంకారపూరితగా ధోరణి తో మాట్లాడిన ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణమరాజు వైఖరిని ఖండిస్తూ 53,54 సిపిఎం శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహిం చారు. ముందుగా వెంకటేశ్వరపురం సెంటర్ నుంచి విజయా పాలడెయిరీ సెంటర్ మీదుగా తిరిగి వెంకటేశ్వంపురం సెంటర్ చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ , సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విద్యార్థి దశ నుండి ఉన్నత విలువలు సైద్ధాంతిక రాజకీయ విలువలు కలిగిన వ్యక్తిగా జీవితాన్ని గడుపు తున్నారని అన్నారు. శ్రామిక వర్గ పేదల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. స్వార్థాలకు పార్టీలను మారుస్తూ నైతిక విలువలు కోల్పోయి జీవితాన్ని గడుపుతున్న ఉండి ఎమ్మెల్యే రఘురామకష్ణను రాజు పేదోళ్ల ఇళ్లను తమ అధికారంతో దౌర్జన్యంగా కూల్చివేయడం అన్యాయమన్నారు. నష్టపరిహారం పునరావాసం లేకుండా ఇళ్లను కూల్చివేసి ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. దీనిని ప్రశ్నించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పై ఇష్టాను సారంగా అనుచిత వ్యాఖ్యలు అహంకారపూరిత వైఖరితో మాట్లాడడం ఖండిస్తున్నామన్నారు. దీనిని బలపరుస్తున్న కూటమి ప్రభుత్వం ఫలితం అనుభవించక తప్పదని అన్నారు. తక్షణమే అతని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదోళ్ల ఇళ్లకు పునరావాసం కల్పించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి 53వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి గడ్డం శ్రీనివాసులరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మూలం ప్రసాద్, పి.సూర్యనారాయణ, జి. నాగేశ్వరరావు, కత్తి పద్మ, జాఫర్, వేణు, స్థానిక శాఖ సభ్యులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ చేపట్టిన సిపిఎం నాయకులు

సైదాపురంలో అధికారుల తనిఖీలు

గుట్టుచప్పుడు కాకుండా సాగింది? - 'ప్రజాశక్తి' వార్త ఎఫెక్ట్


ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సైదాపురంలో జరుగుతోన్న అక్రమ మైనింగ్‌కు సంబంధించి ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారుల తనిఖీలు నిర్వహించారు. ఈ వ్యవహారంలో మైనింగ్ అధికారులు పాత్ర ఉందనే విమర్శలున్నాయి. సైదాపురం మైనింగ్ మాఫియా మంగళవారం హల్‌చల్ చేశారు. 'ప్రజాశక్తి'లో మైనింగ్ అక్రమాలపై వార్త ప్రచురితమైంది. అక్కడకు వెళ్లిన విలేకర్లపై ఓ మైన్ సిబ్బంది దౌర్జన్యానికి దిగారు. ఫొటో తీసుకోడానికి అనుమతివ్వలేదు. మాకు అనుమతులున్నాయి. మీరెండు వస్తారంటూ హెచ్చరికలు జారీ చేశారు. సైదాపురం మండలం గోనుపల్లికి చెందిన ఓ నాయకులు తమకు ఉన్న రెండు మైనింగ్ లీజులు చూపించి చుట్టుపక్కల మైన్స్ నుండి పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్నారనే విమర్శలున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అనుమతులున్నాయని కొందరు మైన్స్ యజమానులు చెబుతున్నారు. ఇక్కడ వాస్తవ పరిస్థితులు కేవలం మైనింగ్ అధికారులకు మాత్రమే తెలుసు. కనీసం ఎవరీ మైనింగ్ రహస్యాలు అధికారులు బయటపెట్టడం లేదు. ఆఫీసుకు వెళ్లినా ఎవరూ సమాధానం చెప్పరు. విషమంలో ప్రత్యేక బృందాలతో విచారణ జరిపితే తప్ప వాస్తవాలు బయటకురావు. మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు మైనింగ్ మాఫియాలో కలిసి పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి సమయంలో వీరికే విచారణ బాధ్యతలు అప్పగిస్తే దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లే అనే స్థానికులు అంటున్నారు. మంగళవారం విచారణకు వెళ్లిన అధికారులు గోనుపల్లి, సైదాపురం ప్రాంతాల్లో పర్యటించి ఎవరికీ తెలియకుండా వెళ్లిపోయారు. ఏం విచారణ జరిపారు, ఎవరు వచ్చారనే విషయం కూడా ఎక్కడా పొక్కనివ్వడం లేదు. ఇటీవల వైసిపి నాయకురాలు పొట్టేళ్ల శిరీష నెల్లూరులో మైనింగ్ డిడిని కలిసి సైదాపురం మండలం, లీజులు ముగిసినా శోభారాణి, జయలక్ష్మి, సిద్ధివినాయక మైన్‌లలో అక్రమ మైనింగ్ కొనసాగిస్తూ, జలటిన్ స్టిక్స్ తో పేలుళ్లకు పాల్పడుతూ పరిసర గ్రామాలను భయాందోళనకు గురి చేస్తూ విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. మంగళవారం విజిలెన్స్ అధికారులు సైదాపురం మండలంలోని సిద్ధి వినాయక ,శ్రీనివాస పద్మావతి, జయలక్ష్మి మైన్ లతోపాటు మరికొన్ని మైన్‌లలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం విజిలెన్స్ అధికారులను వివరణ కోరగా తాము మైనింగ్ విచారణ చేయలేదని తెలిపారు. మైనింగ్, విజిలెన్స్ ఎవరు వచ్చారనే విషయమే అంతుపట్టడం లేదు. ,మూడో కంటికి తెలియకుండా ఎవరికి సమాచారం ఇవ్వకుండా వచ్చి గుట్టుచప్పుడు కాకుండా కనీసం స్థానిక విలేకరులకు కానీ మరేదైనా మీడియా వారికి కానీ ఇతర అధికారులకు గాని సమాచారం ఇవ్వలేదు. ఎక్కడికి వచ్చారు ఎన్ని మైన్ లలో సోదాలు చేశారు, వాటిలో ఏమైనా అక్రమాలు గమనించారా, కనీసం ప్రాథమిక సమాచారం మీడియాకు గాని పత్రికలకు చెప్పడం లేదు. మైనింగ్ అంతా మాయగానే కనిపిస్తోంది.


సైదాపురంలో ఓ మైన్‌లో మైనింగ్ దృశ్యం

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని టిఆర్‌ఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ వారి సహకారంతో కందుకూరు పట్టణ, మండల మహిళల కొరకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు కేవలం భర్త సంపాదన పైనే ఆధారపడకుండా టైలరింగ్ నేర్చుకుని తద్వారా వచ్చే సంపాదనతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు మహిళల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మహిళలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నారు. ప్రతి మహిళ టైలరింగ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టైలరింగ్ నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించి 90 రోజుల తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాగేశ్వరరావును టైలరింగ్ శిక్షణకు వచ్చిన మహిళలు సత్కరించారు. నెల్లూరు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, బిజెపి నాయకులు ఘట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు ఉఉఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీను, మహర్షి శ్రీను, అత్తంటి శ్రీహరి నాయుడు ఉన్నారు.



ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్‌సి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు కందుకూరు అన్న క్యాంటీన్ వద్ద తెలుగు తమ్ముళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. కందుకూరు టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు నార్నే రోశయ్య ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. టిడిపి నాయకులు మాట్లాఉతూ శ్రీకాంత్ ఆయురారోగ్యాలతో తెలుగుదేశం పార్టీకి ప్రజలకు మరిన్ని సేవలందించాలని వారు ఆకాంక్షించారు. నేతలు పబ్బిశెట్టి వరదరాజ,చిలకపాటి మధు, గడ్డం మాలకొండయ్య,వడ్డెల్ల రవిచంద్ర, పువ్వాడి కోటయ్య, రావూరి రామకోటయ్య,కొత్తూరి సుధాకర్, ముప్పవరపు వేణు, తెలుగు యువత నాయకులు పొడపాటి మహేష్, పోకూరి రాంబాబు,గుర్రం మధు, చవిడిబోయిన కష్ణ, చుండూరి శ్రీకాంత్ మురారిశెట్టి సుధీర్, కోటా కిషోర్, చక్కా కేశవరావు,ఇస్కాల మధు,శివ,మనోహర్ ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న టిడిపి శ్రేణులు

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక ఎంపిపి అనుమతితో వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ నరేం ద్రదేవ్ ప్రకటించారు. సర్వసభ్య సమావేశం నిర్వహించాలంటే ఎంపిపితో సహ 10 మంది ఎంపీటీసీలకు గానూ నలుగురు సభ్యులు హాజరుకావాల్సి ఉంది. అయితే ఎంపిపి మాత్రమే సమావేశానికి హజరు కావడంతో కోరంలేక సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిడిఒ నరేంద్రదేవ్ తెలిపారు.

తహాశీల్దార్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి వలేటివారిపాలెం : వలేటివారిపాలెం తహసీల్దార్ అబుల్‌అమీద్ మండల ప్రజలకు అందించిన రెవెన్యూ సేవలు ప్రసంశనీయమని జెడ్‌పిటిసి ఇంటూరి భారతి తెలిపారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్న తహసీల్దార్ అబుల్‌అమీద కు మంగళవారం ఎంపిపి పొనుగోటి మౌనిక, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, ఎంపిడిఒ నరేంద్ర దేవ్ తో పాటు పలువురు మండల స్థాయి అదికారులు మంగళవారం సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జెడ్‌పిటిసి భారతి మాట్లాడుతూ తహశీల్దార్ నిజాయితీ, నిభద్రతతో పనిచేశారని, ఆయన ఉద్యోగ సమయంలో ఎన్నో అవార్డులు పొందినట్లు తెలిపింది. 39 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ సమయంలో ఒక్క సెలవు కూడ పెట్టలేదంటే ఆయనకు ఉద్యోగంపై ఉన్న నిబద్ధత ఇట్టే అర్థమవుతుందని ఆమె తెలిపారు. సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు, ఇరపని సతీష్ సాదు శ్రీలత, చెన్నిబోయిన ఓబులుకొండయ్య, పిఆర్ ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ మధుబాబుఆర్డబ్ల్యూఎస్ ఏఈ శిరీష ఏవో హేమంత్ భరత్ కుమార్ ఉన్నారు.





రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ నెలకొని ఉన్న ఎఎస్పేట దర్గాను రాష్ట్ర వక్ఫ్ బోర్డు సిఇఒ షేక్ మహమ్మద్ అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీలో భాగంగా దర్గా పరిసర ప్రాంతంలోని భక్తులకు ఏర్పాటు చేసినటువంటి రూములను పరిశీలించారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికులను వారి పనితీరును మెరుగుపరచుకొని సక్రమంగా భక్తులకు సేవలు అందించాలని తెలియపరిచారు. పారిశుధ్య కార్మికులకు జీతాభత్యాల గురించి వివరాలను సేకరించారు. దర్గా ఆఫీసులోని పలు రకాల రికార్డులను నిశితంగా పరిశీలించారు. దర్గా ఇఒ మహమ్మద్ హుస్సేన్ శాలువాతోను, పుష్పగుచ్ఛంతోను సిఇఒను సత్కరించారు. కార్యక్రమంలో దర్గా ఉద్యోగుల సంఘం కార్యదర్శి సిహెచ్ చిన్నయ్య, షేక్ కాజా హుస్సేన్, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

దోలా పురుషోత్తంకు మంత్రి నివాళి



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బిట్రగుంట విశ్వనాథరావుపేటకు చెందిన డోల పురుషోత్తం మృతి చెందడంతో సమీప బంధువైన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి పురుషోత్తం పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడం వారి కుటుంబానికి ఎవరు తీర్చలేని లోటు అని వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. మంత్రివెంట కావలి సిఐ పాపారావు బిట్రగుంట ఎస్సై బొజ్జ, వారి కుటుంబ సభ్యులు హరి, బాబి, గ్రామస్తులు బంధువులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి - ఉదయగిరి : మండల పరిధిలోని 17 పంచాయతీ కేంద్రాలలో వేసవి దృష్ట్యా చలివేంద్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఎంపిడిఒ షేక్ కరిముల్లా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి, శకునాలపల్లి, గండిపాలెం మినహా మిగతా పంచాయతీ కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులు చలివేంద్రాల ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా పన్నులు వసూళ్ల నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. అప్పుడే పంచాయతీలో వేసవిలో తక్షణమే చేపట్టే పనులను సకాలంలో పూర్తిచేసుకోగలమన్నారు.

మధుసూదన్ కుటుంబానికి రూ.50 లక్షలు విరాళం

ప్రజాశక్తి-కావలి : ఉగ్రదాడులకు బలైన కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్ కుటుంబానికి రూ.50లక్షలు విరాళం ఇస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు జనసేన ఆధ్వర్యంలో మంగళగిరిలో మంగళవారం పెహల్గాం అమరులకు నివాళి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో ముఖ్యంగా కావలి వాసి జనసైనికుడు సోమిశెట్టి మధుసూదన్ రావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి జనసేన పార్టీ మంత్రులు, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలు రాష్ట్రనాయకులు, వీరమహిళలతో కలిసి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ పాల్గొని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఈ దాడిలోపాల్గొన్న అమరులకు నివాళులు అర్పిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ముఖ్యంగా కావలిలో మధుసూదన్, భార్య పిల్లలు చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఎంతో బాధను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు వారి కుటుంబానికి జనసేన పార్టీ తరపున రూ.50 లక్షలు ప్రకటించారు. దాంతో పాటు క్రియాశీల కార్యకర్తగా మరో రూ.5లక్షలు కూడా వారి కుటుంబానికి అందించడంతో పాటు ఎప్పటికీ వారి కుటుంబానికి అండగా ఉంటానని తెలియజేశారు.



గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి


ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని కొండాయపాలెం పంచాయతీలోని లే అవుట్‌లో లబ్ధిదారులు నిర్మించుకునే పక్కా గృహాలను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ఈఈ ఎం.వి.మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం ప్రభుత్వం బిసి ఒసిలకు రూ.2.30, ఎస్‌టిలకు రూ.2.50లక్షల వంతున బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశని అబ్ధిదారులు సద్వినియోగ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇఇ ఫిరాహన్, ఎఇ రామకృష్ణరావు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక ఎఎస్‌పేట శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 29వ తేదీ ఉదయం 8 గంటలకు వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించారు. ఈ విజ్ఞాన శిబిరాలకు సుమారు 20మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేసవి సెలవులలో ప్రతి విద్యార్థి పాల్గొని గ్రంథాలయంలోని కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, జీవిత చరిత్రలు, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, ఈ విజ్ఞాన శిబిరాలు జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తామని లైబ్రేరియన్ శ్రీనివాసరాజు తెలియజేశారు. కార్యక్రమంలో నాణేల సేకరణ కర్త ఎమ్‌డి వాయిజ్ పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయడంలో సహకరించారు.

హెల్మెట్ తప్పనిసరి



ప్రజాశక్తి-కావలి : ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించి ప్రమాద సమయంలో ప్రాణ రక్షణ పొందాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుందర్ రావు కోరారు. మంగళవారం స్థానిక ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పిస్తూ భాష్యం స్కూల్ నుండి ఐకాన్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామస్వామి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రామస్వామి పాల్గొని ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు 300 హెల్మెట్లను అందజేశారు. ఫోటో, వీడియో గ్రాఫర్‌లు కార్యక్రమాలను కవర్ చేసేందుకు ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై వెళుతుంటారని వారికి భద్రతను కల్పించేందుకు హెల్మెట్లు అందజేస్తున్నామని డాక్టర్ రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులు వి.హనోక్‌పాల్, కార్యదర్శి సిహెచ్.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరులో మే 1న సిఎం పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా సమన్వయంలో (ఎఎస్ఎల్) భాగంగా సిఎం పర్యటించే ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పి కృష్ణకాంత్ పర్యటించారు. మంగళవారం ఉదయం ఆత్మకూరుకు విచ్చేసిన కలెక్టర్, ఎస్పి ఆత్మకూరు బిసి గురుకుల పాఠశాల వద్ద హెలిప్యాడ్, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లను, నారంపేట ఎంఎస్ఎంఇ పార్కు వద్ద పైలాన్ ఆవిష్కరణ, సభ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు కలెక్టర్, ఎస్పిలు పలు సూచనలు చేశారు. నెల్లూరుపాలెం గిరిజన కాలనీ వద్ద సిఎం స్వయంగా వెళ్లి పింఛన్ అందజేసే ఇంటిని, గిరిజన కాలనీని కలెక్టర్, ఎస్పి సందర్శించారు. మే 1న కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నారంపేట ఎంఎస్ఎంఇ పార్క్ – నెల్లూరుపాలెం మధ్యలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం వద్ద భవన నిర్మాణ కార్మికులతో సిఎం మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారు. ఈ ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించారు. సిఎం పర్యటన ప్రదేశాల్లో ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు సహకరిస్తూ వారి సూచనల మేరకు సిఎం పర్యటన ప్రాంతాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డిఒ పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎపిఐఐసి జెడ్ఎం శివకుమార్, పరిశ్రమలశాఖ జిఎం మారుతీప్రసాద్, ఆర్అండ్బి ఎస్ఇ గంగాధర్, విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పి, కలెక్టర్, ఆర్డిఒ

సోమశిల జలాలు సాఫీగా అందేలా చర్యలు తీసుకోవాలి

- సింకు రైతుసంఘాల అర్జీ

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆత్మకూరు చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతాంగానికి సోమశిల జలాలు సాఫీగా అందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతుసంఘాల నాయకులు, రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎపి రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమోహన్, కృష్ణప్రసాద్, కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి ముఖ్యమంత్రికి అర్జీని రాశారు. ఈ సందర్భంగా వారు అర్జీలోని విషయాన్ని వారు వివరించారు. మర్రిపాడు మండలంలో జరిగే సోమశిల హై లెవల్ కెనాల్ నిర్మాణం పూర్తయితే ఆత్మకూరు చెరువుకు అందే బొగ్గేరు సహజ సాగునీరు అందకుండా పోతుందని తెలిపారు. చెరువు కింద సుమారు 20 గ్రామాల చెరువులకు ఈ బొగ్గేరు సహజ సాగునీరు అందే పరిస్థితి ఉంటున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే కేవలం ఆయా గ్రామాల రైతాంగం సోమశిల జలాలు మీదే ఆధారపడవలసి వస్తుందని బొగ్గేరు సహజ సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. అందువల్ల తీవ్ర నష్ట ప్రభావం కలుగుతుందని వివరించారు. కాబట్టి సోమశిల జలాలు సాఫీగా అందేందుకు ఆత్మకూరు చెరువు ఉత్తరకాలువ నుంచి బొగ్గేరు వరకు ఉన్న కాలువను, బొగ్గేరు లోపల ఉన్న ఎటిఎస్ కాలువను లైనింగ్ చేయాలని కోరారు. దాంతో 11గ్రామాల రైతాంగాన్ని ఆదుకోవడంతో పాటు సుమారు 15వేల ఎకరాల ఆయకట్టుకు శాశ్వతమైన సాగునీరు అందించవచ్చని తెలియజేశారు.



మాట్లాడుతున్న పంప్ ఆపరేటర్స్

తాగునీరు దుర్వినియోగం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

దాహార్తిని తీర్చే పంచాయతీ తాగునీటిని ప్రాసెసింగ్ ప్లాంట్లకు, పంటతోటలకు వినియోగించడం అన్యాయమని రాముడుపాలెం పంపు ఆపరేటర్స్ నాగరాజు, మోషే ఆవేదన వ్యక్తపరిచారు. మంగళవారం మండలంలోని గంగపట్నం గ్రామంలోని వెంకటేశ్వరపురం వద్ద విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదివర్తిపాలెం నుంచి రాముడుపాలెం వెళ్లే మంచినీటి పైపులైన్లను కొంతమంది అక్రమార్కులు అడ్డదారుల్లో మళ్లించి రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంటుకు, ఐదు ఎకరాల మునగ తోటకు వాడుతున్నారని వాపోయారు. రాముడుపాలెం గ్రామ ప్రజలకు తాగేందుకు నీళ్లు రాకపోవడంతో ఆరా తీయగా కొందరు వ్యక్తులు మార్గం మధ్యలో అడ్డగోలుగా పైపును తవ్వి తాగునీటిని తమ సొంత వ్యాపారాలు నిమిత్తం వినియోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు తెలియజేయగా వారు ఏం పట్టించుకోకపోవడంతో మీడియా దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. ఉన్నత అధికారులు ఈ సమస్యపై చర్యలు తీసుకొని పేదలకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.



మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరావు

'ఉపాధి' కూలీలకు అవగాహన

ప్రజాశక్తి-వరికుంటపాడు

జాతీయ ఉపాధి హామీ శ్రామికులు తప్పనిసరిగా సమయపాలన పాటించి ప్రభుత్వం అనుసరించిన కొలతల ప్రకారం పని చేసినట్లయితే ప్రభుత్వం నిర్దేశించిన వేతనం లభిస్తుందని టెక్నికల్ అసిస్టెంట్ బి.హనుమంతరావు తెలిపారు. మంగళవారం మండలంలోని విరువూరు, కృష్ణంరాజు పల్లి తదితర గ్రామాలలో ఫీల్డ్ విజిట్‌కి వెళ్లి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికులు ఉదయం 7 గంటలకు పని ప్రదేశానికి చేరుకొని 11 గంటలలోపే ఉపాధి హామీ మేటు ఫోటో తీసి అప్లోడ్ చేస్తే ఉపాధి హామీ కూలీలకు ఒకరోజు హాజరు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తిమోతి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సబ్ జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

కావలి సబ్ జైలులో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కావలి మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో అడిషనల్ జుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ జి.విక్రమ్ సిన్హా ముఖ్య అతిథిగా హాజరై, అక్కడ వున్న ఖైదీలకు అందుచున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కొన్ని చట్టాలను వివరించారు. అలాగే సమాజంలో చెడు ప్రభావాలను విడిచి, నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, మంచిగా మెలగాలని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం వచ్చే ఉపాధి అవకాశాలు ఉపయోగించుకొని, సమాజంలో గౌరవంగా జీవితం గడిపాలని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయిప్రసాద్, మెంబర్ యం.మాలకొండారెడ్డి, జైలు సూపరింటెండెంట్ చిన్న సుబ్బయ్య, జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ విక్రమ్‌సిన్హా

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి దుత్తలూరు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపిపి చేజర్ల జయంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలపై ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తగా తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే వేసవి ఎద్దడికి నీటి సమస్యలు లేకుండా సంబంధించి అధికారులు ముందుగానే తగిన ఏర్పాటలను సిద్ధం చేయాలని తెలిపారు. అంతేకాకుండా గ్రామాల్లోని కరెంటు సమస్యలు లేకుండా చూడాలని సంబందించిన అధికారికి తెలియజేశారు. పలు సమస్యలపై సర్పంచులు అడిగిన విధివిధానాలను సమంజ అధికారులు వెంటనే పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు మంజూరు కొరకై కార్యదర్శులు ముందుండి లబ్ధిదారుల దరఖాస్తులను స్వీకరించి లోను విషయంలో వాళ్లకి సహకరించాలని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరూ మండల సమస్యలపై ముందస్తు జాగ్రత్తగా ఉంటే వేసవికాలంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ యనమల నాగరాజు, ఎంపిడిఒ టి.హనుమాన్మంతు రావు, మల్లికార్జున మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు కార్యాలయ సిబ్బంది, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి జయంత్‌రెడ్డి

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన చేపట్టారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి జరిగే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. గ్రామాల్లోని సమస్యలు అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశం ఉన్న తూ. తూ. మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దష్టికి తీసుకురాలేదు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు కొందరు గైర్హాజరయ్యారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు రమణమ్మ, వ్యవసాయాధికారి రామ్మోహన్, విద్యాశాఖ అధికారి ధనలక్ష్మి, ఎపిఎం బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల కోసం నీటి సరఫరా

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలత మూగ జీవుల దాహం తీర్చేందుకు జాతీయ రహదారి వెంబడి ఐదు నీటి తొట్టెలను ఏర్పాటు ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీటిని నింపి మూగ జీవుల దాహార్తిని తీర్చడంతో రహదారి వెంట ఉన్న గ్రామ ప్రజలు, వాహనదారులు ఆమెను అభినందిస్తున్నారు. గత 5ఏళ్ళనుండి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మూగజీవులకు దాహం తీర్చడం కోసం సొంత వ్యయంతో నీటిని సరఫరా చేస్తున్నారు.

'దామిశెట్టి'కి రెడ్‌క్రాస్ నివాళులు

ప్రజాశక్తి-కావలి

కావలి రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యులు, వ్యాక్సిన్ సెంటర్ దాత, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడుకు రెడ్‌క్రాస్ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం రెడ్‌క్రాస్ భవనంలో దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, దామిశెట్టి శీనయ్య కష్టపడి చిన్నస్థాయి నుండి పారిశ్రా మికవేత్తగా ఎదిగారని, కావలిలో రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు ఏర్పాటుచేసి పలువురికి ఉపాధి కల్పించారని అన్నారు. అంతేకాక ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి, పలువురు పేద విద్యార్థులకు విద్యాదానం చేశారన్నారు. రెడ్‌క్రాస్ పోషక సభ్యత్వం స్వీకరించడంతో పాటు, వారి తల్లిదండ్రుల పేరుతో వాక్సిన్ సెంటర్ ఏర్పాటుకు సహకరించారని వివరించారు. రెడ్ క్రాస్ పోషక సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బుర్ల రఘుకుమార్ రెడ్డి మాట్లాడుతూ శీనయ్య చిన్నపెద్ద తారతమ్యం లేకుండా అందరిని ఆప్యాయతతో పలుకరిస్తారని, వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సహకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి మురళీకృష్ణ తదితరులు శీనయ్యతో తమ అనుబంధం గురించి, రెడ్‌క్రాస్‌కు వారు అందించిన సహకారం గురించి వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు కలికి శ్రీహరి రెడ్డి, కె.హరినారప రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బియస్ ప్రసాద్, నల్లిపోగు ప్రణీత్, దామిశెట్టి సురేంద్ర, రెడ్ క్రాస్ సిబ్బంది దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు.



'దామిశెట్టి' చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి





ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బిట్రగుంటకు చెందిన మన్సూర్ (28), ప్రవీణ్(27) నెల్లూరు నుండి బిట్రగుంట వస్తుండగా కొడవలూరు మండలం రాజు పాలెం జాతీయ రహదారి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనతో బిట్రగుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్నేహంలో ఇద్దరు కలిసి తిరిగి చావులో కూడా కలిసి ఒకటిగా వెళ్లారు.



రికార్డులు సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉదయగిరి

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే రికార్డులను సక్రమంగా ఉండాలని ఐసిడిఎస్ సిడిపిఒ వి.సునీత తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలు సమయపాలన పాటించి లబ్ధిదారులకు సకాలంలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా చిన్నారులు, గర్భిణులు వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ తేజస్విని, సెక్టార్ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన

ప్రజాశక్తి-విడవలూరు

రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలని మండల పరిధిలోని చౌకచర్ల గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారి వెంకటకృష్ణయ్య రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల్లోని మట్టిని పరీక్షించి మట్టికి తగ్గట్టుగా ఎరువులను వాడుకోవాలని సారవంతమైన మట్టితో అధిక దిగుబడి పంటలను పండించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.